సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 25 । మే । 2024



ఆ బిల్లు తెచ్చిందే బీజేపీ..
ఏడు మండలాల విలీన బిల్లును బీజేపీ తెస్తే కాంగ్రెస్ మద్దతు పలికిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. 8లో



లంచం అడగాలంటే వణుకు..
ఏసీబీ అధికారులు వరుస దాడులతో తమ మార్క్ చూపిస్తూ జిల్లాలో అవినీతిపరులకు చెక్ పెడుతున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 27°

వాతావరణం
జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అదేవిధంగా శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

నృసింహుని రథోత్సవం
రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామివారి ఆలయంలో తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవం కమనీయంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సుదర్శన్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్


సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు కేంద్రాల్లో 1,755 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,601 మంది హాజరయ్యారు. 154 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల కన్వీనర్ బి.నాగముని నాయక్ పర్యవేక్షించారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి గంట ముందే హాల్‌లోకి అనుమతించినట్లు కన్వీనర్ తెలిపారు.

పనుల్లో వేగం పెంచాలి

జెన్‌కో సీఎండీ ముర్తుజా అలీ

మణుగూరు టౌన్: బీటీపీఎస్‌లో బీహెచ్‌ఈఎల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ ఆదేశించారు. శుక్రవారం ఆయన భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ప్లాంట్ సీఈ బిచ్చన్నతో కలిసి విద్యుదుత్పత్తి, యూనిట్ల పనితీరును పరిశీలించారు. అనంతరం ప్లాంట్ పనుల తీరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ పనులు చివరి దశకు చేరడంతో మిగిలిన పనుల వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, బీహెచ్‌ఈఎల్ జీఎం అజిత్ వర్మ, ఇంజనీర్లు, ఏజీఎం పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో కార్మికుడికి గాయాలు
బీటీపీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ కార్మికుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తొలుత కొత్తగూడెం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బొగ్గు కన్వేయర్ బెల్ట్ వద్ద పనిచేస్తున్న షేక్ జైపాల్‌కు తెల్లవారుజామున 3 గంటలకు చేయికి తీవ్ర గాయమైంది. దీంతో కార్మికుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సాగని సీతమ్మ సాగర్

ఏడాది కాలంగా నిర్మాణ పనులకు బ్రేక్
- పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు
- గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసుల జారీ
- అనుమతులు వస్తేనే పనులు ముందుకు


ఆగిన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర పర్యావరణ శాఖ లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా ఏడాది కాలంగా సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కేంద్రంతో చర్చించి అవసరమైన అనుమతులు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎన్‌జీటీ విచారణ
అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ నిర్మాణ పనుల కారణంగా తాము నష్టపోతున్నామని, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారంటూ ప్రాజెక్టు నిర్వాసితులు ఆందోళన చెందారు. దీంతో వారు ముందుగా హైకోర్టును, ఆ తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌టీజీ)ను ఆశ్రయించారు. నిర్వాసితులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన ఎన్‌జీటీ నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలంటూ 2023, మే 29న ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి నివేదిక ఇవ్వాలంటూ ద్విసభ్య కమిటీని నియమించింది.

రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు
ఎన్‌జీటీ ఆదేశాలతో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్‌లో రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్), గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డులో ఎస్‌ఈ ర్యాంక్‌కు తక్కువకాని ఇద్దరు అధికారులతో కూడిన కమిటీ జూన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. నిర్వాసితులతో మాట్లాడి, రికార్డులు పరిశీలించింది. చివరకు 2023, జూలై 15న కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖకు 2023, సెప్టెంబరు 23న నోటీసులు జారీ అయ్యాయి. అందులో కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ (ఈసీ) రాకుండా నిర్మాణ పనులు ఎందుకు చేపట్టారో తెలపాలంటూ కోరింది. అంతర్రాష్ట్ర వివాదాలు తలెత్తే అవకాశమున్న ఈ ప్రాజెక్టు విషయంలో ఈసీ కియరెన్స్ లేకుండా 35 శాతం వరకు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆగిన పనులు
గత ప్రభుత్వ హయాంలో ఓవైపు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు కేంద్రం నుంచి ఈసీ అనుమతుల కోసం ప్రయత్నాలు జరిగాయి. 2023 జూన్ నాటికి సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తి చేయాలనే లక్ష్యంతో భారీ ఎత్తున యంత్రసామగ్రి, వర్క్ ఫోర్స్‌ను నిర్మాణ స్థలికి తరలించారు. ఇరిగేషన్ అధికారులు సమర్పించిన డీపీఆర్‌కు పదేపదే కేంద్రం కొర్రీలు వేయడంతో అనుమతులు రాలేదు. ఈ అంశంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2023, మే 29 నుంచి పనులు ఆపేశారు. నిర్మాణ స్థలం నుంచి భారీ యంత్రాలను తరలించారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసి గుడారాలు ఖాళీ చేశారు. ఏడాది కాలంగా నిర్మాణ ప్రదేశంలో అటున్న ఇటుక తీసి ఇటు పెట్టలేదు.

సీతారామ పూర్తయితే..
భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాల మధ్యన గోదావరి నదిపై సీతమ్మ సాగర్ పేరుతో బ్యారేజీ నిర్మిస్తోంది.

ఎప్పుడు మొదలయ్యేనో..
సీతమ్మసాగర్ బ్యారేజీ పనులపై 2023, సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు అందాయి. అప్పటికే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. ఆ తర్వాత నవంబరులో నోటిఫికేషన్ జారీ, డిసెంబరులో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖల ఫోకస్ అంతా మేడిగడ్డ బ్యారేజీలో తలెత్తిన లోపాలపైనే కేంద్రీకృతమయ్యాయి. ఈలోగా 2024, మార్చి 16న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఫలితంగా సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల విషయంలో జాప్యం నెలకొంటోంది. మరోవైపు సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి కాలువల నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. పంప్ హౌస్‌ల నిర్మాణం పూర్తయి రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం సీతమ్మ సాగర్‌కు నిర్మాణ అనుమతులు సాధించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఓటింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక


ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల సందర్భంగా ఓటర్లు ఓటేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. బ్యాలెట్ పేపర్‌పై ఎన్నికల సంఘం ద్వారా సరఫరా చేసిన వైలెట్ స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. అభ్యర్థులకు ఓటరు ప్రాధాన్యం ప్రకారం 1 లేదా 2 లేదా.. అంకెలు వేయాలని పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్‌పై ఏ ఇద్దరు అభ్యర్థులకు ఒకే నంబర్ వేయొద్దని, ఒకే అభ్యర్థికి రెండు ప్రాధాన్యతలు ఇవ్వకూడదని సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం
ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయపరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపకూడదని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని చెప్పారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో చేరుకునేలా అన్ని రూట్లలో ఆర్‌టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులకు సందేహాలుంటే 89192 79238, 97018 42606 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎంహెచ్‌ఓ శిరీష పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు


విత్తనాల నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు హెచ్చరించారు. మండల కేంద్రంతోపాటు, జగన్నాథపురంలో విత్తనాలు, పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, సీడ్ స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్టిఫైడ్ విత్తనాలను మాత్రమే అమ్మాలని తెలిపారు. రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించాచరు. ఏఓ కరుణామయి, ఏఈఓలు ఆయన వెంట ఉన్నారు.

ఆస్పత్రులకు నిరంతరం విద్యుత్


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్/భద్రాచలం అర్బన్ : ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని టీజీ ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీకంసింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన మణుగురు, భద్రాచలం ఏరియా ఆస్పత్రులు, విద్యుత్ సబ్ స్టేషన్లను సందర్శించారు. ప్రభుత్వాస్పత్రుల్లో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్లను పరిశీలించారు. వైద్యాధికారులను అడిగి విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ మణుగూరు ఆస్పత్రిలో మరో నూతన ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలని, 250 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఇప్పటికే 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోందని, అదనంగా మరో 11 కేవీ లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, ఏఈ రాజారావు, ఎఫ్ఎం రాఘవేంద్రరావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు సర్వేశ్వరరావు, త్రినాథ్ రెడ్డి,యుగంధర్, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు సునీల, రామకృష్ణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


సోంపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

బూర్గంపాడు: వర్షాకాలం ఆరంభమవుతున్న తరుణంలో ప్రజారోగ్యం పట్ల వైద్యారోగ్యశాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శిరీష ఆదేశించారు. మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామంలోని గృహాలను సందర్శించి లార్వా శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లలోని పాత్రలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పశువులు నీరు తాగేందుకు ఏర్పాటు చేసుకున్న తొట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరిబొండాలు, ఇతర పాత సామగ్రి ఉంటే తొలగించాలన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇళ్లను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టి హెల్త్‌క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోరంపల్లిబంజర పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీసాహితి, సిబ్బంది జీతు, రవి, సదాలదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రారంభం


ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 456 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 438 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 85 మంది హాజరు కావాల్సి ఉండగా, 76 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరంలో మొత్తం 541 మందికి, 514 మంది హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్ష జనరల్ సబ్జెక్ట్‌కు 1,157 మంది హాజరు కావాల్సి ఉండగా, 1087 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 264 మంది హాజరు కావాల్సి ఉండగా, 232 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 1,421 మందికి 1,319 మంది హాజరుకావాల్సి ఉండగా, 102 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ చేపట్టిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు.

‘కారుణ్య’ మిస్టరీ..?

- ప్రైవేట్ నర్సింగ్ కళాశాల వద్ద ఉద్రిక్తత
- మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసులకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం


పోలీసులతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువుల వాగ్వాదం


రోదిస్తున్న విద్యార్థిని తల్లి సునీత

భద్రాచలంఅర్బన్: నర్సింగ్ విద్యార్థిని కారుణ్య మృతికి గల కారణాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. తల్లిదండ్రులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం విద్యార్థిని కుటుంబీకులు, బంధువులు కళాశాల వద్ద ఆందోళన చేపట్టగా, పరిస్థితి ఉద్రిక్తగా మారింది. పోలీసులకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం నెలకొంది. వివరాలు ఇలా.. భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న పడిగిపల్లి కారుణ్య (18) గురువారం అనుమానాస్పదస్థితిలో కళాశాల భవనంపై నుంచి కింది పడింది. తీవ్ర గాయాలుకాగా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ఉదయం కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరసన తెలిపారు. ఆందోళనకు పలు దళిత సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

కళాశాల కార్యదర్శిపై దాడి
ఆందోళన సమయంలోనే కళాశాల కార్యదర్శి ఎస్ఎల్ కాంతారావు అక్కడికి రాగా, మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన్ను కారులో నుంచి బయటకు లాగి దాడి చేశారు. దీంతో పోలీసులు కాంతారావును కళాశాలలోని ప్రిన్సిపాల్ గదికి తరలించారు. ఈ క్రమంలో ఆందోళన మరింత తీవ్రతరం చేశారు. యాజమాన్యం అకారణంగా విద్యార్థినిని పొట్టనబెట్టుకుందని ఆరోపించారు. ఉన్నతాధికారులు కళాశాల వద్దకు రావాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన కూతురు మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించాలని మృతురాలి తల్లి సునీత డిమాండ్ చేశారు. తన కూతురి మృతిని కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఆమె స్నేహితురాలిని తీసుకొస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు, దళిత సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం
ఆందోళన జరుగుతుండగానే అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని చెబుతుండగా, దళిత సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో మృతురాలి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కళాశాల యాజమాన్యంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా మధ్యవర్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షలు ఇచ్చేలా యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా కారుణ్య మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మృతురాలి తండ్రి గురుమూర్తి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

మృతిపై పలు అనుమానాలు
విద్యార్థిని కారుణ్య మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిట్స్‌తో చనిపోయిందని, హాస్టల్ మొదటి అంతస్తు పైనుంచి పడి తీవ్ర గాయాలతో మృతిచెందిందని, గుర్తుతెలియని దుండగుడు దాడి చేశాడనే వాదనలు వినిపించాయి. ఏడు పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిందని శుక్రవారం మరో వాదన వెలుగుచూసింది. నర్సింగ్ కళాశాల నిర్వాహకుడి కుమారుడు కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, తనమాట వినకపోవడంతో దాడికి పాల్పడ్డాడని, దీంతో విద్యార్థిని మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, కారుణ్య మృతికి అసలు కారణం మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది.

జాగ్రత్తలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో వర్షాకాలంలో ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 15 నుంచి సమస్యాత్మక గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయిస్తామని, గత మూడేళ్ల డేటా ఆధారంగా మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే గ్రామాలను గుర్తించి ముందస్తు వైద్య శిబిరాలు నిర్వహించాలని వివరించారు. వలస గొత్తికోయ గ్రామాల్లో వైద్య సేవలందించాలని తెలిపారు. రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి


జగన్నాథపురం నర్సరీలో పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

చంచుపల్లి/పాల్వంచరూరల్: వర్షాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన పాల్వంచ మండలం జగన్నాథపురం, రంగాపురం, నాగారం, నారాయణరావుపేట, చుంచుపల్లి మండలం గౌతంపూర్, బాబూక్యాంపు గ్రామపంచాయతీల్లో పర్యటించారు. నర్సరీలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. ఇంటింటి నుంచి సేకరించే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలల్లో డివిజన్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్, ఎంపీఓలు బి.నారాయణ, సత్యనారాయణ, సిబ్బంది సాయిరాం, మౌనిక, రాజు, ప్రవీణ్, సతీష్, జ్యోతి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆ బిల్లు తెచ్చింది బీజేపీ..

మద్దతు పలికింది కాంగ్రెస్

- ఫలితంగా ఏడు మండలాలు కోల్పోయి ఉమ్మడి ఖమ్మంకు అన్యాయం
- ఆనాడే బీఆర్ఎస్ కొట్లాడినా పట్టించుకోలేదు
- పట్టభద్రుల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి రాకేష్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ మధు, వెంకటవీరయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు, లోయర్ సీలేరు ప్రాజెక్టును ఆంధ్రాకు అప్పచెప్పింది ఈ కాంగ్రెస్, బీజేపీలు కాదా? ఆరోజు కొట్లాడింది గులాబీ జెండా. మా భద్రాచలంలో పార్కింగ్ స్థలం ఉండదు.. మా రాముల వారి గుడికి వచ్చే భక్తులకు ఇబ్బంది అవుతుందని కొట్లాడింది బీఆర్ఎస్. కానీ బిల్లు పెట్టిన బీజేపీకి కాంగ్రెస్ మద్దతు ఇచ్చి ఇదే రాహుల్‌గాంధీ, ఇదే కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేశాయి'. అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సత్తుపల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ హక్కుల కోసం పోరాడాం..

పోరాటాలు చేసి, చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చిందే కేసీఆర్ అని హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాల కోసం నిజాయితీగా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో బిల్లును గట్టిగా అడ్డుకుంటే ఏడు మండలాలు ఆంధ్రాకు పోయేవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఖమ్మం జిల్లాకు, తెలంగాణకు తీవ్రమైన అన్యాయం చేసిన విషయమై మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ కోసమే పుట్టిన బీఆర్ఎస్ ద్వారా హక్కుల కోసం నిక్కచ్చిగా పోరాటం సాధ్యమవుతుందని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ సీటు బీఆర్ఎస్‌దే..

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొదటి నుంచి బీఆర్ఎస్ గెలుస్తోందని హరీశ్‌రావు తెలిపారు. తొలుత దిలీప్‌కుమార్, ఆపై పల్లా రాజేశ్వరరెడ్డి ఇప్పుడు రాకేష్‌రెడ్డి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పల్లాకు వేసిన ఓటు వృథా కాలేదని, పట్టభద్రులు పల్లాను రెండుసార్లు గెలిపించగా ఆయన నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కాంట్రాక్టు లెక్చరర్లు, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై నిరంతరం పనిచేశారని తెలిపారు. అదేమాదిరి రాకేష్‌రెడ్డి కూడా అంత బాగా పనిచేయగలిగిన విద్యావంతుడని పేర్కొన్నారు.

ఒక్క హామీ అమలు కాలేదు..

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని.. చాంతాడంత హామీలు ఇచ్చి, ఆవగింజంత కూడా అమలు చేయలేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరిట బాండ్ పేపర్లు చేతుల్లో పెట్టి ఇప్పుడు చేతులెత్తేశారన్నారు. పైగా ఆరింట ఐదు అమలు చేశామని ఆ పార్టీ తప్పుడు ప్రకటనలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు మహాలక్ష్మి కింద రూ.2,500, రైతులకు రూ.7,500, ధాన్యంపై రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12వేలు, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, పేదలందరికీ ఇళ్లు, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, యువతులకు స్కూటీలు, నిరుద్యోగులకు భృతి, మెగా డీఎస్సీ ఇలా అన్నీ కలగానే మిగిలాయని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తామనలేదని చెప్పారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి హామీలన్నీ అమలు జరిగేలా చూస్తామని హరీశ్‌రావు తెలిపారు. ప్రతీ పట్టభద్రుడిని కలిసి రాకేష్‌రెడ్డికి ఓటు వేసేలా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు.

రాకేష్‌రెడ్డికి ఓటు వేయాలి..

బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, బిట్స్ పిలానీలో చదివి గోల్డ్‌మెడల్ సాధించారని, ఆయన ఎమ్మెల్సీగా గెలిస్తే రైతు బిడ్డల భవిష్యత్ గొప్పగా మారుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయాన అనేక మందిపై వందల కేసులు నమోదైతే.. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నపై బ్లాక్‌మెయిల్ కారణంగా కేసులు నమోదయ్యాయని విమర్శించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో నీళ్లు.. రబీలో బీళ్లు

తల్లాడ: రాష్ట్ర మంత్రులు పూటకో విధంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తల్లాడ మండలం నూతనకల్‌లో శుక్రవారం ఆయన సాగర్ కాల్వ, రబీలో బీళ్లుగా వదిలేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో నీటి కటకట ఏర్పడినా అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఆనాటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సాగర్ నీళ్లు విడుదల చేయించారని తెలిపారు. ఆ తర్వాత రబీలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా నీళ్లు రాక బీళ్లుగా వదిలేశామని చెప్పారు. ఈ ఏడాది ఇంకా పచ్చి రొట్ట విత్తనాలు కూడా ఇవ్వడం లేదని చెప్పగా హరీశ్‌రావు ఏఓ తాజుద్దీన్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుబంధు ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలం కాగా, సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామంటే దొడ్డు రకాలు సాగు చేసే వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ విషయంలో మంత్రులు పూటకో మాట చెబుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

చుంచుపల్లి: అమలుకు సాధ్యం కానీ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేడు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేసి, నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా 1,200 మందికి పైగా ప్రాణత్యాగాలు చేసి కేసీఆర్‌కు పాలన అప్పగిస్తే పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని స్కామ్‌లమయంగా మార్చారని విమర్శించారు. ఆ తర్వాత టక్కు టమార మాటలు, హామీలతో రేవంత్‌రెడ్డి అమలకు నోచుకోని వాగ్దానాలు చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు అధికారం ఇచ్చారని, 420 హామీలు, ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్, యువతకు రూ.4 వేల ఉద్యోగ భృతి వంటివి పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడం లేదని, నేడు ధాన్యం కొనుగోలు విషయంలో అనేక షరతులు పెట్టి రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రజలకు సుస్థిరపాలన అందిస్తున్నారని, బీజేపీలో కిందిస్థాయి నుంచి కార్యకర్తగా పనిచేస్తూ అనేక ఉద్యమాల్లో ముందుడి స్ఫూర్తిగా నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులు ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు రంగాకిరణ్, కరగంచి రమేశ్, నంబూరి రామలింగేశ్వరరావు, గోంగూర వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ టిప్పర్ డ్రైవర్ల నిరసన


నిరసన తెలుపుతున్న టిప్పర్ డ్రైవర్లు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేస్తున్న డ్రైవర్లు.. వేతనాలు, ట్రిప్ మామూళ్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బొగ్గు రవాణాను నిలిపివేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ.. 24 గంటల నిరంతర బొగ్గు రవాణాతో ప్రతి రోజూ 16 వేల టన్నులు మణుగూరు నుంచి బీటీపీఎస్‌కు 130 టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో బండికి ఇద్దరు డ్రైవర్లు ఉండగా, 24 గంటలు పనిచేస్తే రూ.వెయ్యితో పాటు ట్రిప్పుకు రూ.125 చొప్పున మామూళ్లు ఇస్తున్నారు. కాగా నెలకు రూ.18 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని, రూ.1200 వేతనంతో పాటు 250 ట్రిప్పు మామూళ్లు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేస్తూ బొగ్గు రవాణా 6 గంటలకు పైగా నిలిపివేయగా, లారీ ఓనర్లు సంప్రదింపులు జరిపి రూ.1200 వేతనంతో పాటు ట్రిప్పు మామూళ్లు రూ.160 ఇచ్చే విధంగా అంగీకరించారు. ప్రతిపాదనకు అంగీకరించిన డ్రైవర్లు బొగ్గు రవాణాను పునరుద్ధరించారు.

'కాంగ్రెస్ నేతల దౌర్జన్యంతోనే ఆత్మహత్యాయత్నం'


మాట్లాడుతున్న పగడాల సతీశ్‌రెడ్డి

కరకగూడెం: ఉపాధి హామీ పథకంలో మేట్ బూరా రజిని ఆత్మహత్యాయత్నానికి పినపాక మండలంఏడూళ్ల బయ్యారానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు, ఓ విలేకరే కారణమని ఆమె భర్త రమేశ్, బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీశ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడూళ్ల బయ్యారం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, ఈ నెల 21న మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల ముందే మేట్ రజినిపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన రజిని రెండు రోజుల కిందట పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. సమయానికి స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యాన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవిశేఖర్‌వర్మ, ఎంపీటీసీ జహంగీర్, నాయకులు భవానీశంకర్, కొండేరు రాము, దొడ్డ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

29న అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెంటౌన్/దమ్మపేట: ఈ నెల 29న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను దమ్మపేటలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేటలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు గ్రౌండ్‌కు చేరుకోవాలని, అండర్–8, 10, 12, 14, 16, 18, 20 కేటగిరీల్లో బాలబాలికలను ఎంపిక చేసి, జూన్ 6న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని వివరించారు.

కేవీకేలో విత్తన మేళా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం విత్తన మేళా–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక విత్తన రకాలపై అవగాహన కల్పించారు. కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వరి, మొక్కజొన్న, అపరాల విత్తనాలు, కేవీకే ఉత్పత్తి చేసిన వరంగల్ రకం(962) విత్తనాల సమాచారాన్నివివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ ఖరీఫ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

'ఉపాధి హామీ'పై సామాజిక తనిఖీ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద శుక్రవారం ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీపై ఇన్‌హౌస్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ రవి మాట్లాడుతూ పథకం అమలులో అన్నపురెడ్డిపల్లి మండలం రాష్ట్రస్థాయిలో రెండో స్థానం, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. మండల వ్యాప్తంగా 2023–24 సంవత్సరంలో రూ. 5.29 కోట్లతో చేపట్టిన 575 పనులను ఈ నెల 16 నుంచి సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీ నివేదికలు వివరించారు. ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓలు అన్నపూర్ణ, మహాలక్ష్మి, ఎంపీఓ శబ్బు, ప్రమీల, అనిల్ పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తె అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: మరి కొద్ది గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన పెళ్లి కుమార్తె కనిపించకుండా పోయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్‌ఐ యాకూబ్ అలీ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 25 ఏళ్ల యువతికి, మరో గ్రామానికి చెందిన యువకుడితో ఈ నెల 25వ తేదీన పెళ్లి చేసేందుకు నిశ్చయించారు. ఇరు వైపులా కుటుంబీకులు కొద్ది రోజులుగా పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గురువారం యువతి తండ్రి, కుటుంబీకులు శుభలేఖలను బంధువులకు ఇచ్చేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి పెళ్లి కుమార్తె కనిపించకుండా పోయింది. దీనిపై యువతి తండ్రి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రూ.లక్ష నగదు చోరీ

వైరా: వైరా మున్సిపాలిటీ 7వ వార్డు పరిధి పరిధి బ్రాహ్మణపల్లిలో చోరీ జరిగింది. బ్రాహ్మణపల్లికి చెందిన కొంగర నాగేశ్వరరావు రెండు రోజుల ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుమారుడి ఇంటికి వెళ్లారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తాళం సైతం పగులగొట్టి రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపు తీసి ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఇచ్చిన సమాచారంతో నాగేశ్వరరావు చేరుకుని పరిశీలించారు. బీరువా లాకర్‌లోని బంగారం అలాగే ఉండగా రూ.లక్ష నగదు చోరీ అయినట్లు చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

లంచం అడగాలంటే వణుకు..

- దడ పుట్టిస్తున్న ఏసీబీ అధికారులు
- సాధారణంగా మారిన డబ్బు వసూళ్లు
- ఉద్యోగుల అవినీతిపై టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ విస్తృత ప్రచారం..



అవినీతి నిరోధక శాఖ వాల్‌పోస్టర్

కొత్తగూడెంటౌన్: లంచం అడగటం అనేది చాలా సాధారణమైన విషయంగా పరిణమించింది. లంచం లేనిదే పనికావడం లేదనేది బహిరంగ రహస్యం. ఈ నెల 16వ తేదీన అశ్వారావుపేట, 23న చర్లలో లంచం అడిగిన ఉద్యోగులను ఏసీబీ అధికారులు వలవేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం విదితమే. లంచం అడగటం కాదు ఇవ్వటం కూడా నేరమనే విషయం ఇప్పుడు బాగా పనిచేస్తోంది. ఏసీబీ (అవినీతి నిరోధకశాఖ) వరుస దాడులతో లంచగొండులకు నిద్రపట్టడం లేదు. ఏసీబీ అధికారులు తమ మార్కును చూపిస్తూ అవినీతి పరులకు చెక్ పెడుతున్నారు. ఇటీవలి కాలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లంచం అడిగిన అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు. పలానా అధికారి లంచం అడుగుతున్నారని ఫిర్యాదు వస్తే చాలు ఏసీబీ అధికారులు లంచగొండులను పకడ్బందీగా ఆధారాలతో సహా పట్టుకుంటున్నారు. పోలీసులు, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ, మున్సిపల్ అధికారులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జిల్లాలో నెలల వ్యవధిలో దాదాపు నాలుగు ఘటనలు జరిగాయి.

అవినీతిపై పోరాటం..

ఏ శాఖలో.. ఎంత పెద్ద అధికారి లంచం అడిగినా సామాన్యులు ఎదురొడ్డి పోరాడుతున్నారు. లంచాలు ఇవ్వకుండా లంచగొండులను పట్టిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏదైనా పని కావాలంటే చాలు లంచం లేనిదే అధికారులు పని చేసేందుకు ససేమిరా అంటున్నారు. ఈజీ మనీతో జేబులు నింపుకోవాలని చూస్తూ ఆమ్యామ్యాలకు అలవాటు పడిన ఉద్యోగులు.. ప్రజలను పట్టిపీడిస్తున్నారు. దీంతో సామాన్యుల నుంచి అన్ని వర్గాల ప్రజలు లంచం అడిగితే తక్షణమే ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

అవినీతి నిరోధక చట్టం

భారతదేశంలోని ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ వ్యాపారాల్లో అవినీతిని ఎదుర్కోవడానికి అవినీతి నిరోధక శాఖ చట్టం 1988, సెప్టెంబర్ 9న అమలులోకి వచ్చింది. 2018, జూలై 26వ తేదీన సవరణ చట్టం అమలోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఏ వ్యక్తి నుంచి అయినా అనవసరమైన ప్రయోజనాన్ని ఆశించి లంచం తీసుకోవడం నేరంగా పరిగణిస్తారు. ఒక పబ్లిక్ డ్యూటీ తప్పుగా లేదా నిజాయితీగా చేయకుండా లంచాన్ని ఆశిస్తే ప్రభుత్వ సేవకుడికి సెక్షన్–7 కింద నేరానికి పాల్పడినందుకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది.

రెండు నెలల్లో పట్టుబడిన వారు..

- చర్ల మండలం దండుపేటకు చెందిన కర్ల రాంబాబు 3.5 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించగా రూ.50 వేలు లంచం అడిగాడు. రాంబాబు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే అధికారి గతంలో బూర్గంపాడులో పనిచేస్తున్న సమయంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కూపన్ల కోసం లంచం డిమాండ్ చేసి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఏసీబీ వలలో రెండుసార్లు చిక్కడం గమనార్హం.
- భద్రాచలంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్, సీసీ కెమెరా ఆపరేటర్లు లంచం తీసుకుంటూ ఏప్రిల్ 18వ తేదీన ఏసీబీ అధికారులకు చిక్కారు.
- పాల్వంచ కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మూడు ప్లాట్లను కొనుగోలు చేసిన కాంపెల్లి కనకేశ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రూ.10 వేలు డిమాండ్ చేశారు. కనకేశ్ ఏసీబీకి ఫిర్యాదు చేయగా వారు సూపర్‌వైజర్‌ను పట్టుకున్నారు.
- మే 16వ తేదీన లంచం అడిగిన ట్రాన్స్‌కో ఏఈఈ (ఆపరేషన్స్) ఏసీబీకి పట్టుబడ్డారు.

సమాచారం ఇవ్వండి..



పబ్లిక్ సర్వెంట్లు ఎలాంటి ప్రయోజనాలు ఆశించకుండా పనిచేయాలి. అలాకాకుండా లంచం అడిగినా ఇచ్చినా నేరమే. ప్రజల్లో చైతన్యం రోజురోజుకూ పెరుగుతోంది. ఎవరు లంచం అడిగినా ఎంత పెద్ద ఉద్యోగి అయినా భయపడకుండా పట్టిస్తున్నారు. ఎవరు లంచం అడిగినా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలి. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. లంచంను అరికట్టేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల పోస్టర్లను ఏర్పాటు చేశాం.

– వై.రమేశ్, ఏసీబీ డీఎస్పీ

బెట్టింగ్ కోసం బురిడీ..!

ఫైనాన్స్ ఉద్యోగులకు యువకుడి టోకరా?

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు చెందిన ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులను ఓ యువకుడు రెండ్రోజుల కిందట మోసగించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మండలంలోని గుర్రాల చెరువు గ్రామానికి చెందిన యువకుడు స్థానిక ప్రైవేట్ ఫైనాన్స్ కార్యాలయం సిబ్బంది నుంచి రూ.60 వేలు తీసుకున్నాడు. తన బంగారం వేరే బ్యాంకులో తాకట్టులో ఉందని.. అడ్వాన్స్‌గా రూ.60 వేలు ఇస్తే బంగారం విడిపించి తమ వద్ద తాకట్టు పెడతానని నమ్మబలికాడు. అతని ప్రతిపాదనకు ఆమోదించిన ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది తమకు ఓ ఖాతా పెరుగుతుందని.. టార్గెట్‌కు పనికివస్తుందని భావించి అడిగినంత డబ్బులిచ్చారు. యువకుడు బంగారంతో బ్యాంకుకు రాలేదు. నగదు లెక్క చూపకుండా కార్యాలయాన్ని మూయలేరు. ఏదోలా ఆ రాత్రికి కార్యాలయాన్ని మూసేసి ఇంటికెళ్లిన సిబ్బంది రెండో రోజు అతని కోసం వేచి చూసినా ఫలితం శూన్యం. అతని అడ్రస్ వాకబు చేసి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఆశ్రయించారు. జరిగిన కథంతా చెప్పగా.. 'మా వాడు క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. మీరిచ్చిన డబ్బులు మొత్తం కాజేసి ఉంటాడు. అయినా బంగారం ఇవ్వకుండా డబ్బులెలా ఇచ్చారు' అని ప్రశ్నించారు. తెల్లమొహం వేసిన ఫైనాన్స్ సిబ్బంది ఏం చేయాలో తెలియక.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఉన్న ప్రైవేటు ఉద్యోగం కాస్తా పోతుందని గుట్టుచప్పుడు కాకుండా ఉన్నట్లు సమాచారం. ఈజీ మనీకి క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసైన యువకుడు మోసాలకు కూడా పాల్పడుతూ చిరుద్యోగులను మోసం చేశాడు.

సింగరేణి డైరెక్టర్లతో ఆస్ట్రేలియా బృందం భేటీ


ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్‌తో సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్లతో ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్ బృందం కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం భేటీ అయింది. సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించగా.. అవసరమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విషయంలో ఆస్ట్రేలియా బృందం చర్చించింది. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ పరిధిలో గనులు, ప్రస్తుతం అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి, రవాణా తదితర అంశాలను వివరించారు. అలాగే, వ్యాపార విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లపై చర్చించారు. అనంతరం ఆస్ట్రేలియా కమిషనర్ డేనిస్ ఈటెన్ మాట్లాడుతూ వారిదేశంలో బొగ్గు రంగంలో అమలవుతున్న సాంకేతికత, వ్యాపార అవకాశాలను తెలుసుకుని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకునేందుకు సింగరేణి డైరెక్టర్లను ఆహ్వానించారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా బృందం కొత్తగూడెంలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గనిని సందర్శించింది. ఈ సమావేశాల్లో సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజు, ఉద్యోగులు బి.రవీందర్, పాలడుగు శ్రీనివాస్, బృందం సభ్యులు రామకృష్ణ, మనీష్ భట్టి, ఆస్ట్రేలియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

నడ(ర)క యాతన

బండరాళ్ల మధ్య వాగు దాటుతున్న ప్రజలు



ములకలపల్లి మండలం ముత్యాలంపాడు శివారు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గాను లో లెవల్ చప్టాను పూర్తిగా తొలగించి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే, గురువారం రాత్రి కురిపిన భారీ వర్షానికి డైవర్షన్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా, రాత్రి నుండి ముత్యాలంపాడు, రాచన్నగూడెం జీపీలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మారుమూల ఆదివాసీ గ్రామాలకు బయటి గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి, అయితే, శుక్రవారం అత్యవసర పనులపై వచ్చిన ప్రజలు వాగు దాటేందుకు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనాల మాటేమో కానీ నడిచే మార్గం కూడా సరిగ్గా లేక వాగు నీళ్లలో, ఒడ్డున ఉన్న బండరాళ్ల మధ్య తిప్పలు పడుతూ వాగు దాటారు. డైవర్షన్ రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేసేందుకు మట్టి తెప్పించినా రాత్రి వరకు రహదారి సౌకర్యం అందుబాటులోకి రాలేదు,

– ములకలపల్లి

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముగ్గురు మావోయిస్టులు దంతెవాడ అదనపు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. అదనపు ఎస్పీ రాంకుమార్ కథనం మేరకు.. మయిన్‌గూర్ ఏరియాకు చెందిన ముగ్గురు మావోయిస్టులు పార్టీ సిద్ధాంతాలు నచ్చక లొంగిపోయేందుకు నిర్ణయించుకొని తమ వద్దకు వచ్చారని తెలిపారు. లొంగిపోయిన వారికి తక్షణ పునరావాసం కింద ఒక్కొక్కరికీ రూ.25 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. లొంగిపోయినవారిలో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉంది.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు కథనం మేరకు.. మండలంలోని రాజుపేట శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు దాడులు నిర్వహించి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.2,800 నగదు, నాలుగు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

పాము కాటుతో ఆదివాసీ బాలుడు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన మానుగట్టకు చెందిన బాలుడు ముసికి సుఖదేవ్ (10) పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మానుగట్ట గ్రామంలో తునికాకు సేకరణ కోసం తల్లిదండ్రులతో కలిసి సుఖదేవ్ అడవిలోకి వెళ్లాడు. అక్కడ తునికాకు సేకరిస్తుండగా పాము కరిచింది. వెంటనే వైద్యం అందించడానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎనిమిదికి చేరిన ఎన్‌కౌంటర్ మృతులు


ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు – పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. గురువారం దంతెవాడ – బీజాపూర్ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. అయితే, రాత్రి కావడంతో మృతదేహాలను తరలించే ప్రక్రియను నిలిపివేసిన భద్రతా బలగాలు శుక్రవారం ఉదయం ఆ పనికి ఉపక్రమించాయి. ఇంతలోనే మళ్లీ మావోయిస్టులు కాల్పులకు దిగగా, పోలీసులు సైతం కాల్పులు మొదలుపెట్టగా మరో మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి అత్యాధునిక ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు. మూడు రోజుల నుంచి కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసు బలగాలు విజయం సాధించాయని ఆయన వెల్లడించారు. కాగా, మావోల మృతదేహాలను దంతెవాడ జిల్లా కేంద్రానికి తరలించాక గుర్తించే ప్రక్రియ చేపడతామని ఆయన తెలిపారు.